సాక్షి
చిత్తూరు
శనివారం । 4 । నవంబర్ । 2023



యువతకు ఉపాధే లక్ష్యం
పలమనేరులో మెగా జాబ్ మేళాను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించారు. - IIలో



ప్రశాంతంగా సీస్ సర్వే పరీక్ష
జిల్లా వ్యాప్తంగా శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. - IIలో



9న శాంతి సద్భావనా యాత్ర
రచయిత చిగురుమళ్ల శ్రీనివాస్ ఈనెల 9న శాంతి సద్భావనా యాత్రను ప్రారంభించనున్నారు. - IIలో

న్యూస్‌రీల్

వక్రతుండ మహాకాయ..



హోమ పూజల్లో ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే పూజలు, ఉత్సవాల్లో భక్తులు, సిబ్బంది కారణంగా దోషాలు జరిగి ఉంటే ఆలయ పవిత్రతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ఆగమ శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రెండో రోజు ఉదయం 6 గంటలకు అలంకార మండపంలో విఘ్నేశ్వర పూజతో రెండవ రోజు పవిత్రోత్సవాలను ప్రారంభించారు. రాత్రి 9 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్యంగ్రహణం, వాస్తు శాంతి, అంకురార్పణ, రక్షా బంధనం, కలశస్థాపన పూజలు చేశారు. రెండవ కాల పూజ, మండలేశ్వర ప్రతిష్ట, హోమం, గంధ పవిత్రం, పూర్ణాహుతి, దీపారాధన, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. నైవేద్యం, మంత్ర పుష్పం, వ్రత సమర్పణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు దంపతులు, అధికారులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజ దాడులు



దేశిరెడ్డిగారిపల్లెలో ధ్వంసమైన అరటి తోట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీలోని దేశిరెడ్డిగారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె దిన్నెపాటి దళితవాడ గ్రామాల్లోని పంట పొలాలపై ఏనుగులు విరుచు పడుతున్నాయి. వరుసగా నాలుగోరోజు ఏడు ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి విధ్వంసం సృష్టించాయి. అరటి, వరి, టమాట, మామిడి తొక్కివేయడంతోపాటు డ్రిప్‌పైపులను ధ్వంసం చేస్తుండడంతో రైతులు భారీగా నష్ట పోతున్నారు. చేతికొచ్చిన పంటలు గజరాజుల దాడితో నాశనం అవుతుండడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఏనుగులు పంటలపై రాకుండా కట్టడికి అటవీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

5న క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

నగరి : ఈనెల 5వ తేదీ అండర్–14 ఉమ్మడి జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సురేష్ బాబు, బాబు, వసంత, విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా పుత్తూరు గుడ్ షెప్పర్డ్ పాఠశాల మైదానంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. హాజరయ్యే క్రీడాకారులు 2010, జనవరి 1వ తేదీ తరువాత పుట్టినవారై ఉండాలన్నారు. స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీ, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ వెంట తీసుకురావాలని తెలిపారు. వైట్ డ్రెస్ కోడ్‌తోపాటు క్రికెట్ కిట్ తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 8919633411 నంబర్‌ను సంప్రదించ వచ్చని పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో పెన్షనర్లకు వెసులుబాటు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని ట్రాన్స్‌కో పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణలో వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఏటా నవంబర్‌లో సంబంధిత కార్యాలయాల వద్దకు వచ్చి నేరుగా లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండేదన్నారు. వారి ఆరోగ్యం, వయస్సును దృష్టిలో ఉంచుకుని తాజాగా వెసులుబాటు కల్పించామన్నారు. జీవన్‌ప్రమాణ్ యాప్‌లో ఐరిష్, వేలి ముద్రలతో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. వాటిని సంబంధిత కార్యాలయాలకు పోస్టు చేస్తే చాలని, నేరుగా రావాల్సిన అవసరం లేదని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 2 వేల మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారన్నారని పేర్కొన్నారు.

కలెక్టర్, జేసీని కలిసిన ఆర్డీవో



శ్రీనివాస్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కుప్పం ఆర్డీవో జి. శ్రీనివాస్ ఉన్నతాధికారులను కలిశారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

పంట నమోదుకు వందనం

దేశానికి అన్నం పెట్టేది రైతు. ఆ అన్నదాతను అన్ని విధాల ఆదుకుని సేద్యం పండగలా సాగాలని ప్రభుత్వం భావించింది. అందుకు పలు పథకాలు అమలు చేసింది. ఆ పథకాల రాయితీలు మొదలుకుని ప్రకృతి వైపరీత్యాల సమయంలో అందజేసే నష్టపరిహారం వరకు ఈ–క్రాప్ వివరాలు ఎంతో కీలకం. పంట రుణాలు పొందేందుకు ఈ ప్రక్రియ ఎంతో దోహదపడుతుంది. ఇలాంటి పంట నమోదు చిత్తూరు జిల్లాలో వందశాతం పూర్తి చేశారు. ఇది అన్నదాతకు వరం కానుంది.

- చిత్తూరు జిల్లాలో ఈ–క్రాప్ నమోదు పూర్తి
- లెక్క పక్కాగా ఉండేందుకు ప్రతి ఎకరాకు సామాజిక తనిఖీ
- ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటసాగుకు ప్రభుత్వం వెన్నుదన్ను
- ప్రకృతి విపత్తుల్లో పంట నష్టానికి పూర్తి భరోసా



క్షేత్రస్థాయిలో పంట వివరాలు ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

సాక్షి, చిత్తూరు: జిల్లాలో 2023 ఖరీఫ్ పంట సాగుకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు పూర్తి అయ్యింది. రైతులు సాగు చేసిన ప్రతి సెంటు పంటకు పారదర్శకంగా ఈ–క్రాప్ నమోదు చేసి, ప్రభుత్వం లెక్క పక్కాగా రికార్డు చేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎంత మేరకు అవసరం అవుతాయని అంచనా వేసింది. ఏఏ పంటలు, ఏఏ ప్రాంతాల్లో ఎంత సాగు చేశారు, ఎంత దిగుబడి రావచ్చన్న వివరాలు సర్కారు సేకరించింది. ఇకపోతే ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంటకు నష్టం కలిగితే రైతులను ఆదుకునేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది.

పెరిగిన చిరుధాన్యాల సాగు

జిల్లాలో చిరుధాన్యాల సాగు కూడా పెరుగుతోంది. 2,155.26 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతుండగా, ఇందులో అండు కొర్రలు 0.11 ఎకరాలు, కొర్రలు 12.84 ఎకరాలు, జొన్న 74.15 ఎకరాలు, రాగి 2,155.26 ఎకరాలు, వరిగలు 0.5 ఎకరాలు, సజ్జలు 1,343.49 ఎకరాలు, సామలు 224.44 ఎకరాలు సాగవుతున్నాయి. అపరాలు 5,983.9 2 ఎకరాల్లో సాగవుతోంది. ఇందులో అనుములు 230 ఎకరాలు, అలసందలు 445.78 ఎకరాలు, ఉలవలు 4,069.55 ఎకరాలు, కందులు 1,071.92 ఎకరాలు, పెసలు 46.13 ఎకరాలు, మినుములు 116.1 ఎకరాలు, శనగలు రెండు ఎకరాలు, ఇతర అపరాల పంట 2.44 ఎకరాలు సాగవుతున్నాయి. వీటితోపాటు ఈ ఖరీఫ్ సీజన్‌లో నువ్వులు 17.204 ఎకరాలు, పొద్దుతిరుగుడు 2.64 ఎకరాలు, సోయాబీన్స్ 1.24 ఎకరాల్లో సాగు అవుతున్నాయి.

జిల్లాలో 2,44,663.90 ఎకరాల్లో సాగు

చిత్తూరు జిల్లాలో మొత్తం 2,44,663.90 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో వరి 19,917.86 ఎకరాలు సాగు చేయగా, చిరుధాన్యాలు 2,155.26 ఎకరాల్లో సాగవుతోంది.

ఆహారేతర నూనె గింజలు 28.21 ఎకరాలలోసాగు అవుతుండగా.. ఇందులో ఆముదం 1.75, గోగునార 0.04, జనుం 0.36 ఎకరాలు, పత్తి 27.21 ఎకరాలలో సాగు చేస్తున్నారు. అలాగే జిల్లాలు వాణిజ్య పంటల కింద మొత్తం 15231.28 ఎకరాలు సాగు చేశారు. ఇందులో అవిశెలు 0.3 ఎకరాలు, చెరుకు నాటు 2,880.54, చెరుకు మర్దాం 12,350 ఎకరాలు సాగులో ఉంది. వేరుశనగ కూడా 36,224.75 ఎకరాల్లో సాగవుతోంది.

పశువుల మేతగా...

జిల్లా వ్యాప్తంగా పశువుల మేతకు సంబంధించి 14,169.94 ఎకరాలు పచ్చిరొట్ట, ఇతర మేతగా 4,684.74 ఎకరాలు సాగవుతోంది.

సిబ్బంది సమన్వయంతో..

జిల్లాలో సాగు చేసిన అన్ని రకాల పంటలను ఆర్బీకే సిబ్బందితోపాటు రెవెన్యూ సిబ్బంది, అధికారులు సమష్టి సహకారంతో ఈ–క్రాప్ నమోదు చేశారు. మండల వ్యవసాయాధికారులు, డివిజనల్ వ్యవసాయాధికారులు పర్యవేక్షణలో ఈ–క్రాప్ నమోదు జరిగింది. ఆ జాబితాలు రైతుల పరిశీలన కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తరువాత పంట వివరాలు ప్రకటించారు.

1,37,560.91 ఎకరాల్లో ఉద్యాన పంటలు

ఉద్యాన పంటలుగా మొత్తం 1,37,560.91 ఎకరాలు సాగవుతోంది. ఇందులో కలప జాతి వృక్షాలు 1,183.23 ఎకరాలు, కూరగాయలు 8,572.83 ఎకరాలు, నర్సరీలు 18.96 ఎకరాలు, పూల తోటలు 1,576.13 ఎకరాలు, పండ్ల తోటలు 1,22,279.29 ఎకరాలు, ప్లాంటేషన్ పంటలు 3,720.9 ఎకరాలు, సుగంధ ద్రవ్యాలు 124.95 ఎకరాలు, ఔషధ, సుగంధ పంటలు 64.36 ఎకరాలు, ఆకుకూరలు 20.26 ఎకరాల్లో సాగతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మల్బరి సాగు 9,025.81 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.



ఈ క్రాప్ వివరాలను పరిశీలిస్తున్న రైతులు

ఈ–క్రాప్ నమోదుతో రైతుకు న్యాయం



ఈ–క్రాప్ నమోదుతో రైతులకు న్యాయం జరుగుతుంది. ఏఏ పంటలు? ఎవరు, ఎంత సాగు చేశారన్న పూర్తి వివరాలు సేకరించారు. పంట నష్టం జరిగితే రైతుకు పూర్తిగా న్యాయం చేసేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయి. పంట దిగుబడి తరువాత ఉత్పత్తులను అమ్ముకునేందుకు కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– వెంకటరమణ, రైతు, సోమల మండలం

గిట్టుబాటు ధర



ఈ–క్రాప్ నమోదుతో పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పనకు వీలు కలుగుతుంది. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. రైతు భరోసా కేంద్రాలతో వేరుశనగతోపాటు ఇతర విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇస్తున్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు ఇస్తున్నారు.

– స్వర్ణలత, రైతు, నెల్లిమంద, పుంగనూరు

జగనన్నకు ధన్యవాదాలు



క్షేత్రస్థాయిలో ఆర్బీకే సిబ్బంది ఈ–క్రాప్ నమోదులో అత్యంత శ్రద్ధ చూపారు. రెవెన్యూ అధికారులు కూడా సహకరించారు. ప్రభుత్వం గతంలో ఈ–క్రాప్ నమోదు ద్వారానే మామిడి రైతుల వివరాలు సేకరించి, గిట్టుబాటు ధర కల్పనకు కృషి చేసింది. మామిడి కాయలు నేరుగా ఫ్యాక్టరీకి తోలేందుకు అవకాశం కల్పించింది. సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

–రాజశేఖర్‌రెడ్డి, రైతు, జొన్న గురుకుల, తవణంపల్లె మండలం

వ్యవసాయానికి సీఎం జగన్ భరోసా



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగానికి భరోసా ఇచ్చారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు విత్తు నుంచి ఉత్పత్తి కొనుగోలు వరకు అన్ని రకాలుగా రైతులకు సహాయపడాలని భావించి అనేక చర్యలు చేపట్టారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయం పండుగలా సాగేందుకు సహకరిస్తున్నారు.

–రామచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, చిత్తూరు

పక్కాగా ఈ–క్రాప్ నమోదు



జిల్లాలో రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా ఈ–క్రాప్ నమోదు వివరాలను పక్కాగా సేకరించారు. ఆ వివరాలు జిల్లా స్థాయిలో పరిశీలించి తిరిగి రైతు భరోసా కేంద్రాలకు పరిశీలన కోసం పంపారు. అలా పరిశీలన చేసిన రైతులు భూములకు సంబంధించిన వివరాలు కచ్చితంగా ఉన్నాయి. ఆ వివరాలను ప్రభుత్వానికి పంపుతాం.

–పి.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

వంద శాతం నమోదు



పంట సాగుకు సంబంధించిన వివరాల సేకరణలో ఈ–క్రాప్ నమోదు అతి ముఖ్యమైంది. జిల్లాలో మొత్తం 2,44,663.90 ఎకరాల పంటలను సాగు చేస్తున్నట్లుగా ఈ–క్రాప్ నమోదు ద్వారా తెలుసుకున్నాం. ఈ–క్రాప్ నమోదు వంద శాతం పూర్తి చేశాం. రైతు భరోసా కేంద్రాల్లో వారం రోజులు పాటు పరిశీలన కోసం ఉంచాం. ఈ కార్యక్రమం పూర్తి కావడంతో ప్రభుత్వానికి పంట సాగుపై నివేదిక అందజేస్తాం.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, చిత్తూరు

అమ్మ దీవెనల కోసం..



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



అన్నదాన పథకాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్,ఈఓ

చౌడేపల్లె: ప్రసిద్ధ శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం ఆశ్వయుజ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా అశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వేకువ జామునే శుద్ధి, నిత్యకైంకర్య పూజలు నిర్వహించారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల నడుమ అభిషేక పూజలు చేశారు. ఊహించని రీతిలో అభిషేక పూజలకు రద్దీ నెలకొంది.

అన్నదాన కేంద్రం ప్రారంభం

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఉచిత అన్నదాన కేంద్రాన్ని శుక్రవారం దేవస్థానం చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ప్రారంభించారు. ప్రతి శుక్రవారం సుమారు 200 మందికి అన్నదానం చేయనున్నట్లు వారు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు అన్నదాన పథకాన్ని ప్రారంభించామన్నారు.

ఇద్దరు సస్పెన్షన్, 23 మంది టీచర్లకు నోటీసులు

- విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదు
- హెచ్చరించిన డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఒక ఎంఈవో, ఒక హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ, 23 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జిల్లా పర్యటనకు విచ్చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ గంగవరం మండలంలో పర్యటించినప్పుడు అనేక లోపాలు గుర్తించారన్నారు. కీలపట్ల ఎంపీపీఎస్ హెచ్‌ఎం పీఎం దామోదరంను, క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయని కారణంగా ఎంఈవో–1 వేణుగోపాల్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీలు తేజోవతి, తులసీనాథం నాయుడు, భాస్కరయ్యకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వహణలో అలసత్వం

మధ్యాహ్న భోజన నిర్వహణ, పర్యవేక్షణలో అలసత్వం వహించినందుకు గాను ఒక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, 17 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఈవో వెల్లడించారు. నగరి మండలం ఏకాంబరకుప్పం ప్రాథమిక పాఠశాలను తాను, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తనిఖీ చేశామన్నారు. 300 మంది విద్యార్థులున్న పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించడంలో హెచ్‌ఎం, టీచర్లు విఫలమయ్యారన్నారు. అలసత్వం వహించినందుకు హెచ్‌ఎం వెంకటేశన్, 16 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. అదే విధంగా పుదుపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సరిగ్గా పాఠాలు బోధించని ఇంగ్లిష్ టీచర్ బాలాజీకి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. యాదమరి మండలం వరిగిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హిమబిందు, అఖిలాండేశ్వరి జవాబు పత్రాలను దిద్దడంలో అలసత్వం వహించినందుకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. టీచర్ల అంకిత భావంతో పనిచేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

ఇద్దరు హెచ్‌ఎంలపై చర్యలకు నివేదికలు

విధుల పట్ల అలసత్వం వహించిన ఇద్దరు హెడ్‌మాస్టర్లపై చర్యలకు జిల్లా విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఇటీవల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటనలో చిత్తూరు నగరంలోని వరదప్పనాయుడు మున్సిపల్, చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి జెడ్పీ హైస్కూళ్లను తనిఖీ చేశారు. ఈ సమయంలో వరదప్పనాయుడు హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మి, మాపాక్షి హైస్కూల్ హెచ్‌ఎం రెడ్డిలక్ష్మి విధుల్లో అలసత్వం వహించినట్లు గమనించారు. వారిద్దరిపై చర్యలు తీసుకునేందుకు డీఈవో కార్యాలయం నుంచి ఆర్జేడీకి నివేదికలు పంపారు.

ప్రజల ముంగిటకే యంత్రాంగం



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ, పక్కన ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



హాజరైన అధికారులు, ప్రజలు

- జగనన్నకు చెబుదాంతో సమస్యల సత్వర పరిష్కారం
- గతంలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు లేవు
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో ప్రజల ముంగిటకే అధికార యంత్రాంగం వచ్చి అర్జీదారుల సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. గంగవరంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యే వెంకటేగౌడ, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం, గ్రామ సచివాలయ స్థాయిలో ప్రతి రోజు మధ్యాహ్నం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాక జిల్లా కార్యాలయానికి వెళ్లలేక సతమవుతున్న ప్రజలకు జగనన్నకు చెబుతాంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అధికార యంత్రాంగాన్నే ప్రజల వద్దకు తీసుకొచ్చారన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం లాంటి కార్యక్రమంలో దేశంలోనే ఎక్కడా లేదని తెలిపారు. ప్రజల ముంగిటకే జిల్లా యంత్రాంగాన్ని తీసుకు వచ్చి సీఎం జగనన్న పారదర్శక పాలన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏళ్లనాటి సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు.

బుధ,శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో..

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ వారంలో ప్రతి బుధ, శుక్రవారం మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అర్జీలకు సత్వర పరిష్కారం చూపుతారని, లేని పక్షంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి 15 రోజుల్లో పరిష్కారం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మొత్తం 135 సమస్యల ఫిర్యాదులు అందగా, అందులో రెవెన్యూకు సంబంధించినవే 103 ఉన్నాయి. హౌసింగ్, డ్వామా పీడీలు పద్మనాభం, గంగాభవాని, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఉమామహేశ్వరరెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్, ప్రభాకర్, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్‌డీఎం హరీష్, జీఎం డీఐసీ చంద్రశేఖర్, డీఎస్ఓ శంకరన్, డీ ఎల్‌డీఓ రవికుమార్, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, సర్పంచ్ చంద్రమ్మ పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన తనిఖీ



ఎన్నికల గోడౌన్ పరిశీలనలో కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లోని ఎన్నికల గోడౌన్‌లో ఈవీఎం, వీవీప్యాట్స్ ఫస్ట్ లెవల్ పరిశీలన ప్రక్రియను కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 16వ తేదీ నుంచి పరిశీలన ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ఫస్ట్‌లెవల్ పరిశీలనను పొరబాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 4, 5 తేదీల్లో బీఎల్‌వోలు ఓటర్లకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శని, ఆది వారాలు బూత్ స్థాయిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని 1762 పోలింగ్ కేంద్రాల్లో కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో, తహసీల్దార్‌లను ఆదేశించారు. బీఎల్ఓలు ఓటరు జాబితా సవరణ, చేర్పులు, మార్పులపై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 1, ఏప్రిల్ 1, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే, నిండుతున్న వారు ఈ ఏడాది డిసెంబర్ 9 లోగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పాస్‌పోర్టు కలిగి విదేశాల్లో ఉంటున్న భారతీయులు ఓటరుగా నమోదు కోసం ఫారం 6 ఏ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

కార్గోలో ఆర్టీసీ ముందంజ



సూచనలిస్తున్న జితేంద్రనాథ్‌రెడ్డి

పుంగనూరు: ఆర్టీసీ కార్గో ద్వారా సరుకులను సకాలంలో అందించడంలో ఆర్టీసీ ముందంజలో ఉందని ఆర్టీసీ రవాణాశాఖాధికారి టి.జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక డిపో మేనేజర్ సుధాకరయ్యతో కలసి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్గో సర్వీసులను మరింత బలోపేతం చేయాలన్నారు. డోర్ డెలివరీ పథకాన్ని వ్యాపారస్తులకు, దుకాణాదారులకు, ప్రజలకు తెలియజేసి సకాలంలో డెలివరీ ఆర్టీసీలోనే సాధ్యం అనే విషయాన్ని సిబ్బంది రుజువు చేయాలని కోరారు. అలాగే సిబ్బంది ఆయిల్ ఖర్చును తగ్గించాలని సూచించారు. సురక్షిత ప్రయాణం ఆర్టీసీ అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్యారేజ్ సూపర్ వైజర్ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


అలంకార మండపంలో కలశ పూజలు



కాణిపాకం..పుష్ప సోయగం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ప్రవిత్రోత్సవాల సందర్భంగా పుష్పాలంకరణతో అలరాలుతోంది. ఈనెల 2న ప్రారంభమైన పవిత్రోత్సవాలు 5వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ వీఐపీ గేట్ వద్ద స్వాగత తోరణాలు, ఆలయ పరిసరాలు, ధ్వజ స్తంభాన్ని పరిమళభరిత పుష్ప తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. -కాణిపాకం(యాదమరి)

తండ్రినే హత్య చేసి పూడ్చేసింది..

- ప్రేమికునితో కలిసి హత్యకు స్కెచ్
- ప్రేమకు అడ్డు చెప్పాడని కక్ష
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

బైరెడ్డిపల్లె : మండలంలోని నాచుకుప్పం గ్రామానికి చెందిన ఉజ్జయినప్ప (38) హత్యకు గురైన విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు..ఉజ్జయినప్ప కనిపించడం లేదని వారం కిందట కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు. గురువారం ఉజ్జయినప్పను హత్య చేసి లక్కనపల్లె చెరువులో పూడ్చి పెట్టారని వదంతులు రేగాయి. దీంతో సీఐ కృష్ణమోహన్, తహశీల్దార్ కుమారస్వామి, రెవెన్యూ అధికారులు లక్కనపల్లె చెరువు వద్దకు చేరుకుని లభించిన ఆనవాళ్ల ప్రకారం తవ్వగా ఉజ్జయినప్ప మృతదేహం బయటపడింది. పోలీసుల విచారణలో పలు విషయాలు బయటపడ్డాయి. ఉజ్జయినప్ప కుమార్తె తావడకుప్పం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించింది. ఇందుకు ఉజ్జయినప్ప అడ్డు చెప్పాడు. దీంతో ప్రేమికుడితో కలిసి తండ్రిని హత్య చేసేందుకు పన్నాగం పన్నింది. వారం రోజుల కిందట ఉజ్జయినప్పకు పథకం ప్రకారం పూటుగా మద్యం తాగించి లక్కనపల్లె చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేసి, అక్కడే పూడ్చి పెట్టారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.


ఉజ్జయినప్ప (ఫైల్)

9న శాంతి సద్భావనా యాత్ర

చిత్తూరు రూరల్: శతక పుస్తకాల రచయిత చిగురుమళ్ల శ్రీనివాస్ వందే విశ్వమారతమ్ పేరిట శాంతి సద్భావనా యాత్రను ఈ నెల 9న ప్రారంభించనున్నట్లు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కరణం విమల పేర్కొన్నారు. చిత్తూరు నగరంలో శుక్రవారం ఆమె యాత్ర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తెలుగు రచయితల సంఘాల ఆధ్వర్యంలో ఆఫ్రికా ఖండంలోని బోట్స్వానా దేశంలో యాత్ర ప్రారంభమై రెండేళ్లపాటు వంద దేశాల మీదుగా కొనసాగుతుందన్నారు. తెలుగు సాహిత్య పరిమళాలను వెదజల్లుతూ.. విశ్వశాంతి, పర్యావరణ పరిరక్షణ, మానవీయ విలువల పెంపు వంటి బృహత్ లక్ష్యాల సాధనే యాత్ర ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సభ్యులు భువనేశ్వరి, సరోజినీదేవి, పుష్పలత, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల మృతదేహాలు బంధువులకు అప్పగింత

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర శివారుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు మహిళల మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన వృంద, జయలక్ష్మి, సుజాత శివకుమార్‌తో కలిసి కారులో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం తిరుగు ప్రయాణంలో చిత్తూరు శివారుల్లోని చెర్లోపల్లె వద్ద కారు కల్వర్టును ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. శివకుమార్ వేలూరులోని ఓ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు.

ప్రశాంతంగా సీస్ సర్వే పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా గుర్తించిన పాఠశాలల్లో శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆయా పాఠశాలల్లో 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. డీఈవో విజయేంద్రరావు, ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి పర్యవేక్షించారు.

అచీవ్‌మెంట్ పరీక్షల తనిఖీ

యాదమరి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అచీవ్‌మెంట్ సర్వే 2023–24 పరీక్షలను డీఈఓ విజయేంద్రరావు తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. వారిచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠ్యాంశాలను శ్రద్ధగా విని నోట్స్ రాసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలను, మరుగుదొడ్లు పరిశీలించారు. ఎంఈఓలు రుక్మిణి, ప్రసాద్, హెచ్‌ఎం గిరిరాజ తదితరులు పాల్గొన్నారు.


నిర్వహణ తీరును పరిశీలిస్తున్న డీఈఓ

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : అన్ని సబ్జెక్టుల టీచర్లు సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని డీవైఈవో చంద్రశేఖర్ అన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని డీఈవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంతపేట మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పాఠశాలల్లో పదవ తరగతి చదువున్న విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల నోటు పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్ పాల్గొన్నారు.


విద్యార్థినులను ప్రశ్నిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

దళారుల మాటలు నమ్మకండి

- ఆంజనేయులునాయక్ పేరుతో డబ్బులు వసూలు
- సమగ్ర శిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్రశిక్ష శాఖ ఉద్యోగినని చెబుతూ బి.ఆంజనేయులు నాయక్ పలువురుని మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సమగ్రశిక్ష శాఖ పరిధిలోని సీఆర్‌పీ పోస్టులను భర్తీ చేస్తున్నారు, డబ్బులిస్తే ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసానికి పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి ఈమేరకు పలువురు ఫిర్యాదులు చేశారని చెప్పారు. బి.ఆంజనేయులు నాయక్ అనే వ్యక్తి తమ శాఖలో పనిచేయడం లేదన్నారు. నిబంధనల మేరకే ఏ పోస్టునైనా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. మాయమాటలు చెప్పి దగా చేసే మోసగాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. ఇలాంటి మోసాలకు ఎవరైనా పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏపీసీ హెచ్చరించారు.


ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి